
ప్రణవ ప్రఘోషం
శ్రీ ప్రణవపీఠం. ఏలూరు
మే ,2026

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు



# మే , 2026

## విషయ సూచిక

మే , 2026

సంపుటి-5
సంచిక-5


01 సంపాదకీయం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం
శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం
శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం
మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్




శ్రీ మహాగణాధిపతయే నమః | శ్రీ గురుభ్యోనమః | శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

# శ్రీ గురుభ్యోనమః

# సంపాదకీయం

## గురు మార్గం

మహాత్ములు ఏ పని చేసినా లోక కల్యాణం కోసమే చేస్తారు. సమస్త జీవులను పరమాత్మస్వరూపంగా భావించే వారినే మహాత్ములు అంటారు. అలాగని లోకాలను పీడించే వారిని మాత్రం క్షమించరు.

శ్లో॥ వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసి, కో హి విజ్ఞాతుమర్హతి ॥

అని శాస్త్రోక్తి. మహాత్ముల మనస్సులు వజ్రం కంటె కఠినంగానూ ఉంటాయి. పుష్పాలకంటె కోమలంగాను ఉంటాయి. వాటిని గ్రహించడం ఎవరి వల్లా కాదు. సమయాన్ని బట్టి దుష్టశిక్షణ కోసం, శిష్టరక్షణ కోసం హృదయాలు కఠిన కోమలాలుగా మారుతుంటాయి. అందువల్ల వారితో చాలా జాగ్రత్తగా ఉండాలి. వారి చరిత్రలను పరిశీలిస్తూ జీవితం పవిత్రంగా గడపాలి. మహాత్ములైన గురువులను మేమే పైకి తీసుకువస్తున్నామని గానీ, మేము లేనిదే గురువులకు కీర్తి సంపదలుండవని గానీ భావించడం సూర్యునికి మా వల్లనే వెలుతురు వస్తోందని భావించడం వంటిది. ఈ భయంకరాజ్ఞానం వల్ల శిష్యులు క్రోధానికి గురి అవుతారు. క్రుద్ధో హన్యాత్ గురూనపి అని సుందరకాండంలో హనుమంతుడు అంటాడు. కోపించినవాడు, ఆ కోపం వల్ల గురువులను కూడా చంపుతాడు. అందువల్ల సద్గురు భక్తులు సంయమనం పాటించాలి. అప్పుడే వారు తరిస్తారు. ఈ కలియుగంలో వేద విరుద్ధ మార్గంలో దేవతారాధన చేసి జీవులు నశిస్తారని నరక వర్ణనలో భాగవతంలో చెప్పారు కనుక గురుమార్గంలో శాస్త్రమార్గంలో నడచి తరించండి. పూర్వం జమదగ్ని తన భార్య రేణుక ఎండలో చాలా బాధపడుతుంటే చూసి సూర్యుడినే తన బాణంతో భయపెట్టాడు. అప్పుడు సూర్యుడు జమదగ్ని తపశ్శక్తికి భయపడి, ఆయనకు దర్శనం ఇచ్చి, కాలాన్ని బట్టి ఎండపెరుగుతూ, తరుగుతుందని కాలచక్రాన్ని ఆపడం ఎవరివల్లా కాదనీ చెప్పి, ఎండ నుండి జీవులకు రక్షణ కలిగించడానికి గొడుగు, చెప్పలు సృష్టించి ఇచ్చాడు. అవి ధరిస్తే ఎండ యొక్క తీవ్రత నుండి జనులకు రక్షణ కలుగుతుందని చెప్పాడు. అందువల్లనే వేసవికాలంలో గొడుగు, చెప్పలు దానం చేయాలని భీష్ముడు ధర్మరాజుతో శాంతి, ఆనుశాసనిక పర్వాలలో చెపుతాడు. ఈ వేసవిలో ప్రజలకు, చల్లని నీరు, మజ్జిగ అందించడం, కొనలేని వారికి గొడుగు చెప్పలు దానం చేయడం మహాపుణ్యకార్యాలు. ఆ పుణ్యాన్ని దేనితోనూ పోల్చలేము. ప్రణవపీఠం[మార్చి, ఏప్రిల్, మే, జూన్] చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ మాసాలలో చలివేంద్రాలను నిర్వహిస్తున్నది. భక్తులు ఈ కార్యక్రమాలకు చేయూతనివ్వండి. గుడి – బడి సమితి సభ్యులు చాలా అద్భుతంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారికందఱకు అనేక దివ్యాశీస్సులు అందజేస్తున్నాము.ఈ మే నెల, జూన్ లలో బృందావనంలో శ్రీమద్భాగవత సప్తాహం జరుగుతున్నది. భక్తులు పాల్గొని తరించండి. జూన్ 1 వ తేది నుండి యమునానదీపుష్కరాలు జరుగుతున్నాయి. ఆ సమయంలో యమునానదీ స్నానాలు చేసి దానాలు చేసిన వారు సకల పాపవినిర్ముక్తులై సంపదలను మోక్ష సంపదను పొందుతారు. ఈ వైశాఖ, జ్యేష్ఠ మాసాలలో ఈ క్రింది శ్లోకాన్ని పారాయణ చేయండి

శ్లో॥గంగా గంగేతి యో బ్రూయాత్ యోజనానాం శతైరపి |
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ||

వందల యోజనముల దూరములో ఉండి కూడా గంగా,గంగా అని ఉచ్చరించిన వారు సర్వ పాపముల నుండి విముక్తులై విష్ణు లోకమును పొందుతారు. ఈ శ్లోకంతో పాటు శ్రీకృష్ణ కవచ పారాయణం చేయండి. గురునింద మహాపాపం. స్వయంగా నిందించకపోయినా గురునింద చేసే వారిని ఎదుర్కొనక పోవడం కూడా మహాపాపమే. మీ గురువులను నిందించే వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పండి. ఒక్కసారి గురువునకు దూరమైన వారు తరించడం, గురువునకు దగ్గఅవ్వడం కష్టమని గ్రహించండి. కులాలతో సంబంధం లేకుండా అందఱూ యథాశక్తిగా అర్చనలు చేసి తరించాలని కోరుతున్నాము. ప్రణవపీఠం సర్వులకూ దేవతారాధన విధానాన్ని అందిస్తుంది. నేర్చుకొని అర్చించి తరించండి. ప్రణవపీఠ పురాణమంటపం, శ్రీ సత్యనారాయణ ఆలయాలు హైదరాబాదు, ఉప్పల్ శాఖలో శీఘ్రంగా నిర్మాణం అవుతున్నాయి. కాశీపీఠం కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడుతున్నది. మీ మీ సహకారాలు అందిస్తూ, దర్శించి తరించండి.అనేక శుభాశీస్సులతో........

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం

శ్లో॥ పూజాం భగవత్ శ్చక్రే రామో గణపతేర్యదా
నైవేద్యైః వివిధైః పుష్పైః తులసీం చ వినా కథమ్

శ్లో॥ తులసీ సర్వపుష్పాణాం మాన్యా ధన్యా మనోహరా
కథం పూజాం సారభూతాం న గృహ్ణాతి గణేశ్వరః ॥

(బ్రహ్మవైవర్తపురాణం.తృ.ఖం.గణేశఖండం.అ.46.శ్లో.4,5)


రాముడు గణపతిని పూజించాడు. వివిధ పుష్పనైవేద్యాలు సమర్పించాడు. కానీ తులసిని ఎందుకు సమర్పించలేదు. తులసి ఉత్తమురాలు. ధన్యురాలు. మనోహరురాలు. సారభూతపుష్పం. అనగా పూజాద్రవ్యాలలో చాలా గొప్పది. అటువంటి తులసిని గణేశ్వరుడు ఎందుకు స్వీకరించడం లేదు.నారదుడు ఇలా అడగగానే నారాయణుడు ఆయనతో ఇలా అన్నాడు — నారదా! ఇప్పుడు నీకు బ్రహ్మకల్పంలో జరిగిన ఒక కథ చెపుతాను. విను.

శ్లో॥ శృణు నారద! వక్ష్యేఽహం ఇతిహాసం పురాతనం
బ్రహ్మ కల్పస్య వృత్తాంత నిగూఢం చ మనోహరమ్ ॥

(బ్రహ్మవైవర్తపురాణం.తృ.ఖం.గణేశఖండం.అ.46.శ్లో.6

)బ్రహ్మకల్పంలో జరిగిన ఒక ఇతిహాసం వినిపిస్తాను. విను. ఈ కథ ప్రాచీనమైనది. రహస్యమైనది. మనోహరమైనది. తులసీదేవి విష్ణుభక్తురాలు. ఒకసారి ఆమె నవయౌవనకాలంలో నారాయణుని స్మరిస్తూ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి ప్రయాణమయ్యింది. ఎంత గొప్పవారైనా అప్పుడప్పుడు తీర్థయాత్రలు చేస్తేనే తరిస్తారని శాస్త్రవాక్యాలు. శాస్త్రాలను లోకంలో చాటడానికి, మహామహిమగల తులసి, తన మహిమలను విడచి కాలినడకన యాత్రలకు బయలుదేరింది.

.. ఇంకా ఉంది



# శ్రీ వేంకటేశ్వర రహస్యము

శ్లో॥ కోపాద్వసిష్ఠ వదితి మాం ప్రత్యుక్తం ద్విజన్మనా
స వసిష్ఠో రక్షతు మాం పావనం చ కరోతు మామ్ ॥ (బ్రహ్మోత్తరఖండం.అ.50.శ్లో.23)

తన మనస్సులో వసిష్ఠుని తలచుకొని ఇలా అనుకొన్నాడు — "కోపంతో ఒక విప్రుడు నన్ను తిట్టాడు. వసిష్ఠుని వలె అన్ని చోట్లకు తయారవుతున్నావు అన్నాడు. నాబోటి పాపులకు ఆ వసిష్ఠుడే దిక్కు. నన్ను ఆ వసిష్ఠుడు రక్షించుగాక! పవిత్రుని చేయుగాక! నాకు వసిష్ఠుడే రక్షకుడు అని నిరంతరం తలచుకొంటున్నాడు. నన్ను ఎల్లప్పుడూ ధ్యానిస్తూ, ఉద్ధరించమని వేడుకొంటున్నాడు.


శ్లో॥ వాగ్వసిష్ఠ, వసిష్ఠేతి సర్వదా తస్య వర్తతే ॥ (బ్రహ్మోత్తరఖండం.అ.50.శ్లో.24)

అతడు ఎల్లప్పుడూ వసిష్ఠా, వసిష్ఠా అంటూ నన్ను గురించే పలుకుతూ శరణుకోరుతున్నాడు. ప్రభూ! బ్రహ్మదేవా! నీకు తెలియనిదేమున్నది? అతడు చేయని పాపం లేదు. శరీరంతోనూ, మనస్సుతోనూ, వాక్కుతోనూ వాడు చేసిన పాపాలను లెక్కించడం ఎవ్వరి వల్లా కాదు. తనను ఆశ్రయించుకొన్న వారిని రక్షించడం గురుధర్మం. నా పౌరోహిత్యపాపాలు, సర్వాబద్ధుని పాపాలు కూడా తొలగించే మార్గం ఏదైనా ఉందా? నేను ఎప్పటికీ పరిశుద్ధునిగానే ఉండే మార్గం సూచించు.

అప్పుడు బ్రహ్మ వసిష్ఠునిపై గల ఆదరంతో ఇలా అన్నాడు — ఎటువంటి పాపాలకైనా ప్రాయశ్చిత్తాలు శాస్త్రాలలో ఉన్నాయి. ప్రాయశ్చిత్త కర్మలను ఆచరించి పాపాలను తొలగించుకో. వసిష్ఠుడు మరలా బ్రహ్మతో ఇలా అన్నాడు — ప్రభూ! ప్రాయశ్చిత్త కర్మల గుఱించి నీ ద్వారా ఎప్పుడో నేను తెలుసుకొన్నాను. అవి ఆచరించే విధానం తెలుసు. కాని అవన్నీ దీర్ఘకాలికాలు. జీవితాంతం ప్రాయశ్చిత్త కర్మలతో గడపలేను కదా!

శ్లో॥ మమ తస్య చ పాపాని ఘనాని బహుళాని చ
ప్రాయశ్చిత్తైః న నశ్యంతి తస్మాత్ త్వాం ఆగతోస్మ్యహమ్ ॥ (బ్రహ్మోత్తరఖండం.అ.50.శ్లో.29)


.....ఇంకా ఉంది



# శ్రీ మత్స్యమహాపురాణం

మత్స్యరూపధారియైన శ్రీమహావిష్ణువు మనువుతో ఇలా అన్నాడు. మనువా! బ్రహ్మదేవుడు ఇరవది ఆరు తత్త్వాలతో కూడిన ఈ జగత్తును సృష్టించిన తరువాత దేవతలను సృష్టించాడు. బ్రహ్మలోకాన్నీ(జనులను) సృష్టించాలన్న సంకల్పంతో సావిత్రీతత్త్వాన్నీ మనస్సులో నిలుపుకొని సమాధి స్థితిలోకి వెళ్ళాడు. అట్లా సావిత్రీతత్త్వాన్నీ జపించడం వల్ల అతని దేహం కల్మషం లేనిదై సగం స్త్రీ రూపాన్ని, సగం పురుష రూపాన్ని పొందింది. అట్లు జనించిన స్త్రీ రూపానికే శతరూప, సావిత్రి, సరస్వతి, గాయత్రి అని వ్యవహారం. తన శరీరం నుండి పుట్టిన ఆమెను తన కుమార్తె అని స్వయంగా బ్రహ్మదేవుడే ప్రకటించాడు. ఐనప్పటికీ ఆమె అందాన్ని చూచి మనస్సును నిగ్రహించుకోలేకపోయాడు.మన్మథ బాణములతో కొట్టబడినవాడై (మన్మథవశుడై)- ఆహా! ఎంత అందమైన రూపం! ఏమి ఆ సౌందర్యం!" అంటూ అందరికీ ఆశ్చర్యం కలిగించేలా పలికాడు. అక్కడున్న వశిష్ఠాదులు "భగినీ! (సోదరీ!)" అని అరచారు. కానీ బ్రహ్మ ఆ స్త్రీ రూపానికి లోలుడు కావడం వల్ల వారి మాటలు చెవికి ఎక్కలేదు. మాటికి మాటికీ "ఆహా! ఏమి సౌందర్యం! ఆహా! ఏమి సౌందర్యం!" అంటూ పొగడసాగాడు. ఈ లోగా ఆ సౌందర్యవతి బ్రహ్మను తండ్రిగా భావన చేసి, నమస్కరిస్తూ ప్రదక్షిణం చేసింది. బ్రహ్మదేవునకు ఆ సౌందర్యవతి అందమైన రూపం నుండి మనస్సు మరలలేకపోతుంది. ఒక వైపు సిగ్గు కలుగుతోంది. తదేకంగా ఆమెనే చూడటం వల్ల బ్రహ్మకు వెలవెలపోవుతున్న చెక్కిళ్ళు గల దక్షిణ ముఖం ఏర్పడింది. ఆశ్చర్యంతో వణుకుతున్న పెదవులు గల పశ్చిమ ముఖం ఏర్పడింది. మన్మథ బాణాలచే పీడింపబడుతూ ఉత్తర ముఖం ఏర్పడింది. ఆ సుందరి బ్రహ్మగారి స్థితిని గమనించి ఇదేమి ? అనే కుతూహలంతో పైకి ఆకాశం వైపు చూస్తుండగా, బుద్ధిశాలియగు ఆ బ్రహ్మకు అయిదవ ముఖముగా ఊర్ధ్వ ముఖం ఉత్పన్నమయింది. ఈ విధంగా బ్రహ్మదేవుడు అక్కడికక్కడే పంచముఖుడైయ్యాడు. తన కుమార్తెగా భావించిన ఆమెను పొందగోరడం చేత అంతవరకు ఆయన చేసిన తపఃఫలమంతా(తపశ్శక్తి) నాశనమై పోయింది. అది చూచి కలవరపడుతున్న తన మానస పుత్రులతో(ఇది వరకు బ్రహ్మ సృష్టించిన మానస పుత్రులను తెలుసుకొన్నాము).. "మీరందరూ వెంటనే వెళ్ళి దేవతలు, అసురులు, మానవులు మొదలగు ప్రజలను సృష్టించండి" అని ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ మానసపుత్రులందరూ వెళ్ళి తమ తమ శక్త్యనుసారం సృష్టి చేయడం మొదలు పెట్టారు. ఈ విధంగా మరీచి మొదలగు మానస పుత్రులు వెళ్ళగానే, వినయంతో వంగిన ముఖం కలిగి- ఏ దోషం లేని పవిత్రురాలైన ఆ శతరూపను బ్రహ్మ పెళ్ళి చేసుకున్నాడు. అతడు లోకనాథుడయ్యు, సామాన్య మానవుని వలె కామపరవశుడై, తన స్థానమైన పద్మాసన గృహంలో ఆమెతో నూరేండ్లు సంసార భోగాలను అనుభవించాడు.

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః శ్రీ మాత్రేనమః శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 354. పశుపాశవిమోచనీ [ఓం ఐం హ్రీం శ్రీం పశుపాశవిమోచన్యై నమః]



జీవులలో అజ్ఞానం ఉన్నంత వఱకు పశువులుగానే పిలవబడతారు. వీరు పాశబద్ధులు. పాశం అనే శబ్దానికి ఆకలి, దప్పిక అనే అర్థాలున్నాయి. పశుస్వరూపులైన జీవులు, ఆకలి దప్పికల చేత పీడింపబడుతుంటారు. ఎంతవఱకు అవసరమో అంతవఱకే ఉన్నంతకాలం ఆకలి దప్పులు జీవికి మేలే చేస్తాయి. అవి అధికమైతే ప్రమాదానికి దారి తీస్తాయి. అమ్మవారు అవి తొలగించి జీవులను రక్షిస్తుంది. పశువులను పాశముల నుండి విముక్తులను చేస్తుంది. “క్షుత్పిపాసామలాం జ్యేష్ఠాం అలక్ష్మీం నాశయామ్యహమ్” అని శ్రీసూక్తం చెపుతోంది.జూదం ఆడడానికి ముఖ్యమైన పాచికలను పాశం అంటారు. తన పాచికలతో పురుషుని జయించినది అని మరొక అర్థం. సంసార బంధాలనుండి విముక్తి కలిగించునది అని కూడా అర్థం.

### మంత్ర ప్రయోగం — ఫలితం

బంధువులు, స్నేహితులు ద్రోహం చేసినపుడు జీవులకు కలిగే బాధ ఇంతింత కాదు. నా అనుకున్నవారి వల్ల నాశనం కాకుండా, నమ్మినవారి నుండి ప్రమాదం రాకుండా కాపాడే మంత్రం ఇది. ఈ మంత్రాన్ని 40 దినాలు రోజునకు 216 చొప్పున జపం చేయాలి. జపకాలంలో తులసీదళాలు లేదా మారేడు ఆకులతో అమ్మవారి పూజ చేయాలి. పులిహర లేక చిత్రాన్నం నైవేద్యంగా సమర్పించాలి. అందులో కొంతభాగాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. ఈ విధంగా మంత్రజపం చేసిన వారు నమ్మిన వారి వల్ల చెడిపోరు. బంధువులు, స్నేహితులు ఈ జపం చేసిన వారిని మోసగించలేరు. మోసగిస్తే నశిస్తారు.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## ఋష్యశృంగ మహర్షి

అంగదేశాన్ని పరిపాలించే రోమపాదుడు అనే రాజు కాలంలో ఆ రాజ్యంలో తీవ్రమైన కరువు వచ్చింది. వర్షాలు పడలేదు, పంటలు పండలేదు, ప్రజలు అల్లాడారు. పండితులు దానికి నివారణగా— "ఋష్యశృంగ మహర్షి మీ రాజ్యానికి వస్తే, వర్షాలు పడతాయి" అని రాజుకు చెప్పారు. రోమపాదుడు ఋష్యశృంగ మహర్షిని రాజ్యానికి తీసుకొచ్చే పని చేసాడు. మహర్షి అంగదేశంలో అడుగు పెట్టిన వెంటనే వర్షాలు కురిసాయి, కరువు తీరింది. సంతోషించిన రాజు తన పుత్రిక శాంతాదేవిని ఋష్యశృంగ మహర్షికి యిచ్చి వివాహం చేసాడు.అయోధ్య మహారాజు దశరథుడికి సంతానం లేకపోవడం వలన ఎంతో దుఃఖం కలిగేది. ఆయన గురువు వశిష్ఠుడు, మంత్రి సుమంతుడు దశరథునికి ఋష్యశృంగ మహర్షి చేత పుత్రకామేష్టి యాగం చేయించినట్లయితే మీకు సంతానయోగం కలుగుతుందని చెప్పారు. దశరథుడు సంతోషించి, ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానించాడు. మహర్షి యాగం చేసాడు. యాగాగ్ని నుండి పాయసం ఉద్భవించింది. దశరథుని ముగ్గురు భార్యలు ఆ పాయసాన్ని సేవించారు. ఆ ఫలితంగా శ్రీరాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు. ఇలా ఋష్యశృంగ మహర్షి తపశ్శక్తి శ్రీమహావిష్ణువు అవతారానికిదోహదపడింది — ఇది ఆయన మహిమను వేనోళ్ళ చాటుతుంది.కర్ణాటక రాష్ట్రంలో శృంగేరి అనే పవిత్రమైన పట్టణం ఉంది. ఆ పట్టణం పేరు ఋష్యశృంగ మహర్షి పేరు నుండే వచ్చింది. ఆ ప్రదేశంలో ఆయన తపస్సు చేసారని నమ్ముతారు. మహర్షి చివరి రోజులలో అడవికి తిరిగి వెళ్ళి తపస్సు చేసారు. ఆయన దేహత్యాగం సమయంలో ఒక తేజస్సు ఆయన శరీరం నుండి వెలువడి శివలింగంలో కలిసిపోయిందని చెప్పబడుతుంది. ఆ శివలింగం "*మలహానికారేశ్వర* 'పేరిట నేటికీ పూజలందుకుంటుంది. ఋష్యశృంగ మహర్షి జీవితం మనకు బ్రహ్మచర్యం ,శుద్ధత,తపస్సు, ధర్మపాలన మరియు నిరాడంబర జీవనం వంటి అనేక విలువైన పాఠాలు నేర్పిస్తుంది.ఋష్యశృంగ మహర్షి అడవిలో పెరిగినా, లోకానికి వెలుగు ప్రసాదించారు. ఆయన జీవితం — జననం నుండి శివలింగంలో విలీనం వరకూ — అంతా ఒక దివ్య ప్రణాళికలో భాగమే. మన పురాణాలు ఇలాంటి మహాపురుషుల చరిత్రలను మనకందిస్తున్నాయి, ఎందుకంటే వారి జీవితాలే మనకు మార్గదర్శనాలు. ధర్మనిష్ఠతో, నిర్మలమైన మనసుతో జీవించిన వారు ఎంత గొప్ప కార్యాలనైనా సాధించగలరు— ఇదే ఋష్యశృంగ మహర్షి మనకు చెప్పిన సందేశం.

.ఇంకావుంది



# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను

| ఆవరణ | గణపతి నామము |
|---|---|
| ఏడవ | మోద వినాయకుడు |
| ఏడవ | ప్రమోద నాయకుడు |
| ఏడవ | సుముఖ వినాయకుడు |
| ఏడవ | దుర్ముఖ వినాయకుడు |
| ఏడవ | గణనాథ వినాయకుడు |
| ఏడవ | జ్ఞాన వినాయకుడు |
| ఏడవ | ద్వార వినాయకుడు |
| ఏడవ | అవిముక్త వినాయకుడు |



కాశీ లో ఏడవ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను, అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

.ఇంకావుంది

## శ్రీ హనుమాన్ సప్తవింశతినామ స్తోత్రమ్ (పరాశర సంహిత)

ఫలశ్రుతి: ఈ క్రింది 27 హనుమంతుని నామాలు ఎప్పుడూ స్మరించుకోవడం వల్ల సర్వ సౌఖ్యాలను పొందుతారు.

1) హనుమానంజనాసూనుః - వాయుపుత్రో మహాబలః | కపీంద్రః పింగళాక్షశ్చః - లంకాద్వీప భయంకరః ||

2) ప్రభంజనసుతో వీరః - సీతాశోకవినాశకః | అక్షహంతా రామసఖో - రామకార్యదురంధరః ||

3) మహౌషధిగిరేర్హారీ - వానర ప్రాణదాయకః | వారీశ తారకశ్చైవ - మైనాకగిరిభంజనః ||

4) నిరంజనో జితక్రోధః - కదళీవన సంవృతః | ఊర్ధ్వరేతా మహాసత్త్వ - స్సర్వమంత్రప్రవర్తకః ||

5) మహాలింగప్రతిష్ఠాతా - భాష్య కృజ్జగతాం వరః | శివధ్యానపరోనిత్యం - శివపూజా పరాయణః ||

